

తిరుపతి ప్రేక్షకులకు థ్యాంక్స్

నివేదా థామస్

'35 చిన్న కథ కాదు' సినిమాను ఆదరించిన తిరుపతి ప్రేక్షకులకు హీరోయిన్ నివేదా థామస్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రాత్రి హీరో విశ్వదేవ్, అసిస్టెంట్ డైరెక్టర్ హరిహర్ష తదితరులతో కలసి తిరుపతిలోని కృష్ణతేజ థియేటర్‌ను ఆమె సందర్శించారు. కాసేపు ప్రేక్షకుల మధ్య సినిమాను వీక్షించారు.తిరుపతి జిల్లా పరిసర ప్రాంతాల్లోనే '35చిన్న కథ కాదు' షూటింగ్ జరిగిందని గుర్తు చేసుకున్న ఆమె చిన్న సినిమా అయినా గొప్పగా ఆదరించారని కొనియాడారు.ప్రేక్షకుల ప్రోత్సాహం ఇలాగే కొనసాగాలని కోరారు.

- తిరుపతి అర్బన్

ఆర్టీసీ జోన్ 4 ఈడీగా చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ కడప జోన్ 4 ఫుల్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిమ్మాడి చెంగల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న గిడుగు వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే.తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారిగా వున్న టి.చెంగల్‌రెడ్డిని ఫుల్‌చార్జ్ ఈడీగా నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.రాయలసీమ పరిధిలోని తిరుపతి, చిత్తూరు,కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.



ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్‌ఐ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు గతంలో ఏపీఆర్‌సెట్ కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో ఏపీఆర్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏపీఆర్‌సెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచీ ఏపీఆర్‌సెట్ తొలి దశ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ నెలాఖరులోపే తొలి దశ అడ్మిషన్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్టు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు వెల్లడించారు.



22 కిలోల గంజాయి స్వాధీనం ఓజీ కుప్పంవాసి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 11: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి అతడి వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సీఐ మహేశ్వర రెడ్డి ఇటీవల ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తపల్లి రోడ్డు క్రాస్ వద్ద గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో మాటు వేసిన పోలీసులు నగరి మండలం ఓజీ కుప్పం గ్రామానికి చెందిన సత్తుపల్లి శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని అతని వద్ద 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి మారుతీనగర్‌లో కాపురముంటున్న శ్రీనివాసులు కిలో గంజాయిని రూ.10,000కు కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.300 లెక్కన అమ్ముతున్నట్టు విచారణలో బయటపడింది.

వరద బాధితులకు పెరుగుతున్న సాయం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులకు వివిధ వర్గాలనుంచీ ఆర్థిక సాయం అందుతోంది.వ్యవసాయ శాఖ ఉద్యోగులు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బుధవారం కలెక్టర్‌కు అందజేశారు.అలాగే గృహనిర్మాణశాఖ ఉద్యోగులు మరో లక్ష రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి కలెక్టర్‌కు అందజేశారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ రూ.23 వేలను, హెడ్ కానిస్టేబుల్ జి. శంకర్ రెడ్డి రూ.20వేలను సీఎం సహాయ నిధికి అందజేశారు.



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

పోలీసులకు తలనొప్పిగా

సత్యవేడు ఎమ్మెల్యే కేసు



- అటు దళిత ఎమ్మెల్యే.... ఇటు టీడీపీ మహిళా నేత
- హోటల్‌కు రాకపోకలపై ప్రాథమిక ఆధారాలు లభ్యం
- ఫోన్ కాల్ డేటా సేకరణపై దృష్టి -అనివార్యంగా కుట్ర కోణంపైనా దర్యాప్తు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటు చూస్తే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నది అధికార పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే.. ఇటు చూస్తే ఆరోపణలు చేసింది అదే అధికార పార్టీకి చెందిన మహిళా నేత... ఆరోపణలు చేస్తున్నది, ఎదుర్కొంటున్నది ఇరువురూ సమాజంలో అణచివేత ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారే... ఎలా చూసినా సున్నిత వ్యవహారం కావడంతో సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదైన కేసు పోలీసు వర్గాలకు తలనొప్పిగా మారింది. దీంతో నిష్పాక్షిక దర్యాప్తుతోనే ఒత్తిడులను అధిగమించాలని, తద్వారా ప్రభుత్వాన్ని ఎవరూ తప్పుపట్టే అవకాశం లేకుండా చేయాలని జిల్లా పోలీసు అధికారులు భావిస్తున్నారు. గత గురువారం అర్ధరాత్రి కేవీబీపురం మండలానికి చెందిన ఓ తెలుగు మహిళ నాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన మహిళే ఈ కేసు విచారణకు సహకరించకపోతుండడం పోలీసు అధికారులకు సమస్యగా మారుతోంది. మరోవైపు ఫిర్యాది, నిందితుడు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో కేసు దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందా లేదా అన్నది ఇపుడు అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చనీయాంశంగా మారుతోంది.

మొబైల్ ఫోన్ కాల్ డేటాయే కీలకం

కేసును ఎంతోకొంత పరిష్కరించగలిగిన ఆధారాల్లో కీలకమైంది మొబైల్ ఫోన్ కాల్ డేటా. దీంతో పోలీసులు ఎమ్మెల్యే ఫోన్, బాధిత మహిళ వినియోగిస్తున్న రెండు ఫోన్లు, ఆమె భర్త ఫోన్లకు సంబంధించిన కాల్ డేటాపై దృష్టి సారించారు. బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్న జూలై 6, 17 తేదీలతో పాటు ఆగస్టు 10వ తేదీ... ఈ మూడు రోజుల్లో వీరి ఫోన్ల నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? ఎవరెవరి నుంచీ కాల్స్ వచ్చాయి? ఎమ్మెల్యే, బాధిత మహిళల్లో ఎవరు ఎన్ని సార్లు ఎదుటి వారికి కాల్ చేశారు? అనే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. అదే విధంగా ఆయా తేదీలకు అటూఇటూ పది రోజుల కాల్ డేటా కూడా సేకరిస్తున్నారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు, ఫిర్యాదు వెనుక కుట్ర ఏమైనా వుందా అన్న కోణంలో కూడా దర్యాప్తు అనివార్యం కానుంది. అందుకే బాధిత మహిళకు, ఆమె భర్తకు ఘటన జరిగిన మూడు రోజులకు ముందు వెనుక రోజుల్లో ఎవరెవరి కాల్స్ వచ్చాయి? వీరి నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? అన్నది కూడా విశ్లేషించనున్నారు.

సీసీ ఫుటేజీల సేకరణ

తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు ఎమ్మెల్యే పిలుపుపై మూడు సార్లు వెళ్ళినట్టు బాధిత మహిళ ఫిర్యాదులో తెలిపిన మేరకు ఆ హోటల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరించారు. అయితే హోటల్‌లో సీసీ కెమెరాలు రికార్డు చేసే ఫుటేజీలు స్టోర్ అయ్యే హార్డు డిస్కు నుంచీ సంబంధిత రోజువారీ డేటా నెల రోజుల పాటు మాత్రమే వుంటుందని, అటు తర్వాత ఆటోమేటిగ్గా ఎరేజ్ అయ్యేలా సెట్టింగ్స్ పెట్టడంతో జూలై నెల 6, 17 తేదీల ఫుటేజీలు లభ్యం కాలేదని తెలిసింది. ఆగస్టు 10వ తేదీ ఫుటేజీలు మాత్రం దొరికాయని చెబుతున్నారు. అందులో ముందుగా ఎమ్మెల్యే ఆదిమూలం హోటల్‌కు రావడం, ఆ తర్వాత బాధిత మహిళ రావడం రికార్డయిందని సమాచారం. బాధిత మహిళ హోటల్ లోపలికి వెళ్ళాక గది వద్దకు, రిసెప్షన్ వద్దకు రెండు సార్లు అటూ ఇటూ తిరిగిన దృశ్యాలు రికార్డయినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సీసీ కెమెరాల హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాని విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు సమాచారం.

సీసీ కెమెరా ఫుటేజీలతో ప్రయోజనం పరిమితమేనా?

దర్యాప్తులో సాంకేతికంగా ఒక దశ వరకూ మాత్రమే ఆధారాలు సేకరించగలమని, అంతకు మించి కేసులోని వ్యక్తుల ఉద్దేశాల విషయంలో తాము చేయగలిగిందేమీ లేదన్నది పోలీసు అధికారుల భావనగా తెలుస్తోంది. సీసీ కెమెరా ఫుటేజీలతో దర్యాప్తులో పరిమితంగానే ప్రయోజనం వుంటుంది తప్ప కేసు పరిష్కారానికి పెద్దగా ఉపయోగపడదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బాధిత మహిళను ఎమ్మెల్యే బెదిరించిన వీడియోలు కానీ లేదా ఆడియో రికార్డులు కానీ ఇప్పటి వరకూ బాధిత మహిళ పోలీసులకు ఆధారాలు ఇవ్వలేదని సమాచారం. అలాగే అసభ్యకరంగా లేదా బెదిరింపులతో కూడిన వాట్సాప్ మెసేజీలు కానీ ఎస్ఎంఎస్‌లు కానీ పెట్టినట్టు కూడా ఆధారాలు అందజేయలేదు.అలాంటి ఆధారాలు వున్నాయో లేదో కూడా బాధిత మహిళ పోలీసులకు వెల్లడించలేదు. అలాంటివి వుంటే ఆరోపణలకు అదనపు బలం కలిగించడంతో పాటు నేర నిరూపణ సులువయ్యేదని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ఎమ్మెల్యే, బాధిత మహిళ ఆగస్టు 10న హోటల్‌కు వచ్చినట్టు ఆధారాలు లభించినా నేరాన్ని నిరూపించలేవన్నది వారి భావనగా వుంది. బాధిత మహిళ తనే రికార్డు చేసినట్టుగా చెబుతున్న వీడియోలో ఎమ్మెల్యే బెదిరించడం లేదా దౌర్జన్యంగా వ్యవహరించడం, అత్యాచారం చేసినట్టుగా దృశ్యాలు వుంటే దర్యాప్తు ఒక కొలిక్కి చేరినట్టే. అయితే అలాంటి దృశ్యాలు అందులో వున్నాయో లేదో దర్యాప్తులో తేలాల్సి వుంది. కాగా హోటల్‌లో ఆ మూడు తేదీల్లో గదులు ఎవరు బుక్ చేశారు? ఎవరి పేరిట బుక్ చేశారు? అన్నది కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఘటన జరిగినట్టు చెబుతున్న తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్ సిబ్బంది సాక్ష్యం కూడా కీలకం కానుంది. పోలీసు విచారణలో వారు వెల్లడించే అంశాలు దర్యాప్తుకు ఉపకరించే అవకాశముంది. బాధిత మహిళ చెబుతున్న తేదీల్లో గదుల్లోకి ముందుగా ఎవరు వెళ్ళారు? ఆయా సందర్భాల్లో బాధిత మహిళ తీరు ఎలా కనిపించింది? గదుల్లో పరిస్థితి అసాధారణంగా అనిపించింది ఏదైనా వుందా? అన్న సమాచారం రిసెప్షన్ సిబ్బంది, రూమ్ సర్వీస్ సిబ్బంది నుంచీ పోలీసులు సేకరించాల్సి వుంది.

ఎమ్మెల్యేని విచారించేది ఎపుడు?

గుండె సంబంధ సమస్యలతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎపుడు డిశ్చార్జి అవుతారో తెలియని పరిస్థితి. ఆస్పత్రి నుంచీ డిశ్చార్జి అయితే తప్ప పోలీసులు ఆయన్ను ప్రశ్నించడం వీలు కాదు. అప్పుడు కూడా వైద్యుల సూచనలు కీలకం కానున్నాయి. గుండె సంబంధ సమస్యలు వున్నప్పుడు ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేయద్దని వైద్యులు ఓ గడువు వరకూ సూచించే అవకాశమున్నట్టు అధికారులు చెబుతున్నారు. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో ఏమి జరిగితే అది ఏ మలుపు తీసుకుంటుందోనని ఆచి తూచి వ్యవహరించాల్సి వస్తోందని దర్యాప్తు అధికారులు వాపోతున్నారు. ఇప్పటికే ఆదిమూలానికి మద్దతుగా టీడీపీలోనూ,వెలుపలా కూడా దళిత వర్గాలు ఆందోళన మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఆయనను పోలీసులు అరెస్టు చేయాలన్నా స్పీకరు అనుమతి తీసుకోవాల్సి వుంటుందని సమాచారం.అలాగని విచారణను సాగదీయడానికి కూడా వీల్లేని పరిస్థితి. అధికార పార్టీకే చెందిన మహిళా నేత తనపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు కావడంతో ఆ కోణంలోనూ దీన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. మరో వైపు ప్రభుత్వ, అధికార పార్టీ ప్రతిష్ఠలతో ముడిపడిన వ్యవహారం. ఈ కారణాలతో సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించి వాస్తవాలను బయటపెట్టి తాము ఒత్తిడి నుంచీ బయటపడాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

వైద్య పరీక్షలకు, విచారణకు సహకరించని ఫిర్యాది

ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపడిన అంశం కావడంతో తిరుపతి పోలీసులు సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదు చేసిన కేసులో దర్యాప్తును వేగంగా మొదలుపెట్టారు. గత గురువారం అర్ధరాత్రి కేసు నమోదు కాగానే శుక్రవారం ఉదయాన్నే బాధితురాలిని వైద్య పరీక్షల కోసం రుయాస్పత్రికి తరలించారు. అయితే ఆమె వైద్య పరీక్షలకు అంగీకరించకపోవడంతో లిఖితపూర్వకంగా రాయించుకుని పంపివేశారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చట్టప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వున్నందున పోలీసులు బాధితురాలి వెంటబడుతున్నారు. ఆ క్రమంలో సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళ వైద్య పరీక్షలు అవసరం లేదని మొండికేసినట్టు సమాచారం. తనను విచారించడం మాని ముందు ఎమ్మెల్యేని అరెస్టు చేసి విచారించాలంటూ ఆమె డిమాండ్ చేసినట్టు తెలిసింది. దీంతో మరోసారి ఆమెతో ఆ మేరకు స్టేట్‌మెంట్ రాయించుకుని పంపించేసినట్టు పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి వైద్యపరంగా చూస్తే ఈ పరీక్షలతో పెద్దగా తేలేది కూడా ఏమీ వుండదని అటు పోలీసులు, ఇటు వైద్యులు కూడా భావిస్తున్నారు. ఎందుకంటే అత్యాచారం జరిగిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహిస్తే పలు ఆధారాలు లభ్యమవుతాయి. దుస్తులపై వీర్యపు ఆనవాళ్ళు, బాధితురాలి దేహంపై ఏవైనా గాయాలు వంటివి వుంటే ఆ మేరకు బలమైన ఆధారాలు లభించేవి. సంబంధిత హోటల్ గదిలోని బెడ్డు, బెడ్ షీట్, టవల్ వంటివి కూడా సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాల్సి వుండేది. వాటి ద్వారా కూడా కొన్ని ఆధారాలు దొరికేవి. గత నెల 10వ తేదీన జరిగిన ఘటనపై పాతిక రోజుల తర్వాత ఫిర్యాదు చేయడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది.

వైద్య పరీక్షలకు ఒప్పుకున్న ఫిర్యాది

ఎమ్మెల్యే ఆదిమూలంపై ఫిర్యాదుచేసిన తెలుగు మహిళ నాయకురాలు బుధవారం మరోసారి తిరుపతి ఈస్టు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.వైద్య పరీక్షలకు ఒప్పుకుని ప్రసూతి ఆస్పత్రిలో జాయినయ్యారు.సోమవారం ఉదయం భర్తతో కలసి స్టేషన్‌కు వచ్చిన ఆమె కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ మహేశ్వర్‌రెడ్డిని కలిసి వైద్య పరీక్షల పేరిట తనను ఇబ్బంది పెట్టవద్దని, తాను హాజరుకాలేనని తేల్చి చెప్పారు.దీంతో సీఐ మహేశ్వర్‌రెడ్డి విషయాన్ని డీఎస్పీ వెంకటనారాయణ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన సూచన మేరకు సీఐ ఆమె నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వచ్చిన ఆమె వైద్య పరీక్షలను రుయాస్పత్రిలో కాకుండా ప్రసూతి ఆస్పత్రిలో చేయించుకుంటానని సీఐ మహేశ్వరరెడ్డికి చెప్పారు. దీంతో పోలీసుల సహకారంతో ఆమె బుధవారం మెటర్నిటీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం జాయినయ్యారు. మరో రెండు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి సిద్ధపడి ఆమె వచ్చిందని, సీఐ మహేశ్వరరెడ్డి చెప్పారు.

- తిరుపతి(నేర విభాగం)

ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు

తిరుపతి (ఆటోనగర్) సెప్టెంబరు11:ఎస్పీడీసీఎల్‌లో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ కె.సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరన్ డిస్కం జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ పదవీ విరమణ చేయడంతో జనరల్ మేనేజరుగా వున్న ఎం.గోపాలకృష్ణను ఆ స్థానంలో నియమించారు. కార్పొరేట్ కార్యాలయంలో డీజీఎంగా వున్న ప్రసాద్‌కు జీఎంగా పదోన్నతి కల్పించారు. అలాగే తిరుపతి సర్కిల్ కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా వున్న శ్రీధర్‌కు డీజీఎంగా,తాత్కాలికంగా పీఓగా పనిచేస్తున్న జీవీఎస్ఆర్ మూర్తిని డీజీఎంగా రెగ్యులర్ చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో రూ.10 నాణెం స్వీకరించాల్సిందే

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల నుంచి 10రూపాయల నాణేలను స్వీకరించాల్సిందేనని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మధ్య కాలంలో పదిరూపాయల నాణేలను చలామణి కావడం లేదంటూ కొందరు కండక్టర్లు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని ప్రయాణికుల నుంచి ఆర్టీసీ యాజమాన్యానికి ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ విడుదల చేసిన 14రకాల రూ. 10నాణేలను ప్రయాణికులు ఇచ్చినప్పుడు స్వీకరించాలని ఆపరేషన్ ఈడీ ఆదేశాలు జారీచేశారు.ఆయా డిపోల మేనేజర్లు తమ పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లకు బుధవారం ఆదేశాలిచ్చారు. అలాగే బస్టాండుల్లో ఉన్న దుకాణాలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలియజేశారు.

కలెక్టర్ ఫిజిక్స్ పాఠాలు

రేణిగుంట, సెప్టెంబరు 11: రేణిగుంటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు.తరగతి గదిలో విద్యార్థినుల నడుమ కూర్చుని ఉపాధ్యాయురాలు బోధిస్తున్న భౌతికశాస్త్రం పాఠాలను ఆసక్తిగా ఆలకించారు.అనంతరం ఆయనే టీచర్‌గా మారి భౌతికశాస్త్రంలోని పలు అంశాలను విద్యార్థులకు బోధించారు. వారిని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన 40 పాఠశాలల్లో రేణిగుంట జడ్పీ బాలికల హైస్కూలు ఒకటన్నారు.ఈ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు, నాణ్యమైన విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. రేణిగుంట మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాలతో పాటు ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు.జాయింట్ కలెక్టర్ త్వరలోనే విచారణ జరుపుతారన్నారు. ఆర్.మల్లవరం ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి త్వరలో చర్యలు చేపడతామన్నారు.ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, డీఈ బాలాజీ, కేవీకే రాస్ హెడ్ డాక్టర్ శ్రీనివాస్, ఎంఈవో ఇంద్రాణి, సర్వశిక్ష ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ శేషుడిపై వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: కాణిపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వరసిద్ధుడు స్వర్ణ శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, కాణిపాకం,వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాన్ని, ధ్వజ స్తంభాన్ని, సుపథ మండపాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకాన్ని నిర్వహించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు చిన్నశేష వాహనంపై పుర వీధులలో ఊరేగారు. రాత్రి ఉభయ వరస రావడంతో కల్యాణ వేదిక వద్ద సిద్ధి,బుద్ధి సమేత గణపతి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. స్వర్ణ పెద్దశేష వాహనంపై ఉత్సవర్లను కాణిపాకంలో ఊరేగించారు. శేష వాహనం సందర్భంగా బుధవారం మణికంఠేశ్వర స్వామి ఆలయం నుంచి ఉభయదారులు పాలు కలిగిన కలశాలను తలపై పెట్టుకుని మాడ వీధుల గుండా ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో కేరళ వాయిద్యాలు, బాజాభజంత్రీలు, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కల్యాణ వేదికపై సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు అభిషేకం.. ఆ తర్వాత పుష్పయాగం నిర్వహించారు.

కాణిపాకంలో నేడు

గురువారం ఉదయం చిలక వాహనం, రాత్రి వృషభ వాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు.. రాత్రి వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.



టీటీడీలో ఇద్దరు అధికారుల డెప్యుటేషన్ పొడిగింపు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఇద్దరు అధికారుల డెప్యుటేషన్ గడువును ప్రభుత్వం పొడిగించింది.రాష్ట్ర సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్ ఎ.విజయలక్ష్మి మూడేళ్ళుగా డెప్యుటేషన్‌పై టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఈమె డెప్యుటేషన్ గడువు వచ్చే నెల 7వ తేదీకి ముగియనున్న నేపథ్యంలో మరో ఏడాది పాటు ఆమె డెప్యుటేషన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.అలాగే డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) ఎ.ప్రశాంతి కూడా డెప్యుటేషన్‌పై టీటీడీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా గత మూడేళ్ళ నుంచీ కొనసాగుతున్నారు. ఆమె డెప్యుటేషన్ గడువు వచ్చే నెల 24వ తేదీకి ముగియనుండడంతో ప్రభుత్వం మరో ఏడాది పాటు డెప్యుటేషన్ పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.



ఎర్రావారిపాలెంలో గణనాథుడి ఊరేగింపు

వైభవంగా గణేష్ నిమజ్జనం

రామచంద్రాపురం, సెప్టెంబరు 11: మండలంలోని గంగిరెడ్డిపల్లి, ఆర్‌సీపురం తోపాటు పలు గ్రామాల్లో బుధవారం వినాయకుడి నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాల నడుమ వినాయకుడిని ఊరేగించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం బై బై గణేశా అంటూ రాయలచెరువుకు తీసుకెళ్లి వినాయకుడిని నిమజ్జనం చేశారు.

ఎర్రావారిపాలెంలో.......

ఎర్రావారిపాలెం మండలంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. 12 పంచాయతీల్లోని 185 ఆవాస ప్రాంతాల్లో గణనాథుడు పచ్చని మండపాల్లో కొలువు దేరి భక్తులకు కనువిందు చేశారు. ఐదోరోజు 80 శాతం పల్లెల్లో గణనాథుడి ఊరేగింపుతో ప్రతి ఇంటా స్వామి వారికి కర్పూర హారతులు పట్టి టెంకాయలు కొట్టారు. చాందినీ వాహనాల్లో స్వామి వారు ఊరేగుతుండగా భక్తులు బోలో మహాగణపతికి అంటూ చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు శాంతి భద్రతలు కల్పించారు.

ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బయో ట్రీమ్ సెల్వి కల్చరిస్టు యశోదబాయ్

మంగళం, సెప్టెంబరు11: ఎస్వీ జూపార్కులో బుధవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో స్మగ్లర్లు, వన్యప్రాణుల బారిన పడి అమరులైన 23మంది అటవీశాఖ అధికారుల కృషిని స్మరించుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బయోట్రీమ్ సెల్వి కల్చరిస్టు యశోదబాయ్ మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో అధికారులు మెళకువతో విధులు నిర్వహించాలన్నారు. తిరుపతి జిల్లాలో అమరులైన అటవీశాఖ ఉద్యోగులు డీఆర్వో శ్రీధర్, ఎఫ్ఎస్‌వో డేవిడ్ కుటుంబాలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, తిరుపతిజిల్లా అటవీశాఖ అధికారి సతీష్ రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్, సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో ధర్మరాజు, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు, జూ ఏసీఎఫ్ నాగభూషణం, రేంజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభచాటిన వారికి నగదు కానుకలు



పాకాల, సెప్టెంబరు 11: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ప్రతిభావంతులకు క్యాట్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు కానుకలు అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాట్ రూట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం పదవ తరగతి పరీక్షల్లో ఆయా పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 28 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున చెక్కులతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ ఏపీఐయూ తిరుపతి ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, క్యాట్‌రూట్స్ ఫౌండేషన్ ప్రతినిధి రవీంద్రనాథ్ కెఎన్‌ఆర్ తిరుమల ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ హెడ్ సామిజ్వాలవర ప్రసాద్‌రావ్ ఎన్‌హెచ్‌ఏపీ ఐయూ డిప్యూటీ మేనేజర్ గోపికృష్ణ, రెసిడెంట్ ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

● కేంద్రమంత్రి సురేష్‌గోపి



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో సురేష్‌గోపి

తిరుమల/తిరుచానూరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): దేశంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని తెలిపారు.

కుటుంబ సమేతంగా 12ఏళ్ల తర్వాత తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నానని, స్వామి దర్శనంతో జీవితకాలానికి సరిపడా తృప్తి కలిగిందని కేంద్ర మంత్రి సురేష్‌గోపి అన్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం వేకువజాము జరిగిన తోమాల, అర్చనసేవలో ఆయన పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం సురేష్‌గోపి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ కేరళలోని వయనాడ్ కోలుకుంటోందన్నారు. అలాగే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి సురేష్‌గోపి దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో కర్ణాటక గవర్నర్



తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అలాగే టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా తిరుమల శ్రీవారిని బుధవారం పర్యాటక మంత్రిత్వశాఖ కార్యదర్శి విద్యావతి, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ డిప్యూటీ హెడ్ వరుణ్ సంజయ్ మాలి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



విద్యావతి - వరుణ్ సంజయ్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.95 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 62,380 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,405 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఎర్రచందనం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



రాయచోటి-మదనపల్లి రహదారిలో పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

● ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

మంగళం, సెప్టెంబరు 11: రాయచోటి-మదనపల్లె రహదారిలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు చేపట్టి ఒక కారులో తరలిస్తున్న 13 ఎర్రచందనం దుంగలతో పాటు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర రెడ్డి బృందం బుధవారం రాయచోటి-మదనపల్లి రోడ్డులో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ మోటరు సైకిల్‌లో ఇద్దరు వ్యక్తులు వేగంగా వెళ్లగా, అదే సమయంలో ఓ కారు కూడా వేగంగా రావడంతో టాస్క్‌ఫోర్సు పోలీసులకు అనుమానం వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ కారు తప్పించుకునే ప్రయత్నంలో ఓ రాయిని ఢీకొని నిలిచిపోయింది. కారులోని ఇద్దరు స్మగ్లర్లు తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేయగా, టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. కారులోని 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం రాజంపేట పరిధిలోని కేశాపురం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించి, ఒక మోటర్ సైకిల్‌పై వచ్చి అడవుల్లోకి చొరబడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇతడు సేలం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మోటర్ సైకిల్, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజంపేట అటవీ ప్రాంతంలో పట్టుబడ్డ స్మగ్లర్‌తో టాస్క్‌ఫోర్సు పోలీసులు



వైభవంగా రాధాష్టమి వేడుకలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 11: శ్రీశక్తిపీఠంలో రాధాష్టమి సందర్భంగా బుధవారం రాధా కృష్ణులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం గోపూజ నిర్వహించారు. అలాగే గణపతి నవరాత్రులు సందర్భంగా పీఠంలో వెలసిన శక్తిగణపతికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా లక్షకుడుమలతో గణపతి హోమం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో శక్తి గణపతి - రాధాకృష్ణులు

వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల ఎన్నికలు ఎప్పుడో..!

● ఐదునెలలు కావస్తున్నా పట్టించుకోని అధికారులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు11: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బోధనేతర ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారోనని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. గత కార్యవర్గ రెండేళ్ల పదవీకాలం ఏప్రిల్ 25వ తేదీతో ముగిసింది. దాదాపు 5నెలలు కావస్తున్నా కొత్తకార్యవర్గ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. అంతకముందు వీసీలేరంటూ కొంతకాలం వెళ్లదీశారని, తీరా ఇన్‌చార్జి వీసీ నియామకం జరిగి కూడా రెండునెలలు కావస్తున్నా అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిని నియమించేందుకు రిజిస్ట్రార్ రెండునెలలుగా ఫైల్‌ని తనలాగిన్‌లోనే ఉంచుకున్నారని ఆరోపిస్తున్నారు. వర్సిటీలో గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన అధికారులే ఇప్పటికీ కీలకస్థానాల్లో ఉన్నారని, అలాగే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్న విమర్శలను కూడా వ్యక్తం చేస్తున్నారు. వీసీ స్పందించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సత్వర చర్యలు చేపట్టాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

17న విశ్వకర్మ యజ్ఞం



విశ్వకర్మ యజ్ఞ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11: ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం తిరుపతి కమిటీ ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఈనెల 17వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మనోహర్ ఆచారి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యజ్ఞం జరుగనుందని చెప్పారు. విశ్వ నిర్మాణానికి ప్రధాన కారకుడైన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి పంచ కులాలకు చెందిన విశ్వకర్మలందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్వకర్మ యజ్ఞ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు తిరుమలాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉపలింగం ఆచారి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి అశోక్ ఆచారి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ ఆచారి, జిల్లా కోశాధికారి ప్రసాద్ ఆచారి, కార్తీక్ ఆచారి, రామచంద్రాచారి, గోవిందాచారి, అన్నామలై ఆచారి, బాలకృష్ణ ఆచారి, ఆదిమూలం మురళీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ పక్కన మరింత ఎత్తుగా రక్షణగోడ



గోడను ఎత్తుగా నిర్మిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11: తిరుపతి రైల్వే స్టేషన్ తూర్పుగా రైల్వేట్రాక్ పక్కనే రక్షణ గోడ మరింత ఎత్తుగా నిర్మించే పనులు జోరుగా సాగుతున్నాయి. చింతలచేను నుంచి ట్రాక్‌కు ఎడమవైపు రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రజలు అక్కడక్కడా ట్రాక్ మీదుగా అటు ఇటు తిరుగుతున్నారు. తరచూ రైళ్ల రాకపోకలతో ప్రజలకు ప్రమాదం పొంచివుందని భావించిన రైల్వే విభాగం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతమున్న రక్షణ గోడను మరింత ఎత్తుగా 8 అడుగుల వరకు నిర్మించతలపెట్టింది. ట్రాక్ పక్కన రోడ్డు ఉన్నంతదూరం రక్షణ గోడను పటిష్ఠంగా నిర్మిస్తున్నారు.

తప్పెవరిది..?

- ఇలా ఉంటే రావా రోగాలు.....

సంజయ్‌గాంధీనగర్ వీధిలో రోడ్డుపై వేసిన చెత్త



తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 11: పట్టణంలోని లీలామహల్ సమీపంలోని సంజయ్‌గాంధీనగర్‌లో రోడ్డుపైనే చెత్త దిబ్బలుగా వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. జనావాసాల మధ్య దుర్వాసనతో దోమలకు నిలయంగా ఉండటంతో ఇలా ఉంటే రోగాలు ఎందుకు రావంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగుకాల్వల్లో మురుగునీరు పారేందుకు వీలు లేకుండా చెత్త నిండిపోయింది. ఆ స్థలంలో దయచేసి ఇక్కడ చెత్త వేయరాదు... అని పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినా అక్కడే చెత్త వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై చెత్త వేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీతో రోడ్డుపైకి మురుగునీరు



పెద్దకాపు లేఅవుట్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీతో రోడ్డుపై చేరిన మురుగునీరు

● దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న స్థానికులు

తిరుపతి(గాంధీరోడ్డు), సెప్టెంబరు11: స్థానిక పీకేలేఅవుట్‌లో ఎస్ఎల్ఎస్ గ్రాండ్ హోటల్(15వడివిజన్) ఎదురుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీ కావడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఇటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ మురుగు వాసనని భరించలేక ముక్కులుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. దీనికితోడు మురుగునీరు పక్కనే ఉన్న తాగునీటి బోర్లలో కలిసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మురుగు, వ్యర్థాలు తాగునీరు బోర్లలో కలిస్తే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు



వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: వెంకటగిరిలో ఏటా వైభవంగా నిర్వహించే పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు బుధవారం అర్ధరాత్రి సంప్రదాయబద్ధంగా జరిగింది. పట్టణంలోని గాలిగంగు దేవస్థానం వద్ద జాతర నిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.అనంతరం ఆసాదుల తప్పెట్ల మోతలు, కేరింతల మధ్య ఈ నెల 25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర జరుగుతుందహో అంటూ స్థానికులు సందడి చేశారు. రాజా వీధిలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు పోలేరమ్మ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని వెంకటగిరి రాజా కుటుంబీకులు వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ యాచేంద్ర సూచించారు.కోటలోని బొడ్డుసైగా మండపంలో పోలేరమ్మ ఆలయ ఈవో ఎ.శ్రీనివాసులు రెడ్డికి ఆనవాయితీ ప్రకారం జాతర నిర్వహణకు తాంబూలం అందించారు.



తవ్వేసి...వదిలేసి..

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11: కరకంబాడి రోడ్డులోని శ్రీనివాససేతు ర్యాంపుకు సమీపంలో మరమ్మతులు చేపట్టేందుకు సైడ్‌కాలువను తవ్వేసి వదిలేశారు. నిర్మాణాల పునాదుల నుంచి సగం రోడ్డు వరకు లోతుగా గొయ్యితీశారు. ఎన్నికల ముందు నుంచి ఆ రోడ్డులో కాలువ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీంతో మురుగునీరు నిల్చిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల వ్యాప్తి పెరిగిపోయింది. ప్రధానంగా అక్కడ నలువైపులా వాహనాలు మలుపులు తిరుగుతూ ప్రయాణిస్తుంటాయి. తవ్వని మట్టి, రాళ్లతో రోడ్డు కుచించుకపోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం వేళలలో విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. ఈ విషయం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వెంటనే అధికారులు స్పందించి కాలువ మరమ్మత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తవ్వి వదిలేసిన సైడ్‌కాలువతో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

పాకాల, సెప్టెంబరు 11: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప అన్నారు. బుధవారం ఆయన పాకాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఫిర్యాదు దారులతో సమస్యలపై మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడి చట్టాలపై వారిని అవగాహన కల్పించాలని ఎస్ఐకి సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పాకాల, సెప్టెంబరు 11: దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లె వద్ద గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కమ్మచెరువు పల్లె ఎస్టీ కాలనీకి చెందిన కె.జయచంద్ర మృతిచెందాడు. ఆయన మృతితో భార్య నాగవేణి నలుగురు పిల్లలు అనాథలుగా మారారు. పత్తిపాటివారిపల్లెకు చెందిన ఎల్ఎస్ నాయుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మృతుడి ఇంటికెళ్లి అతడి భార్య కె.నాగవేణికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం భగవాన్ రామతీర్థ సేవాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కట్ ప్యాకెట్లు అందజేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాకాల, సెప్టెంబరు11: పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా కోరారు. ఎమ్మెస్సీ జువాలజీలో 55 శాతం మార్కులు సాధించినవారు అర్హులన్నారు. పీహెచ్‌డీ లేదా యూజీసీ నెట్, సెట్‌లో ఉత్తీర్ణత సాధించినవారికి ప్రాధాన్యతనిస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 13వ తేది ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, సెప్టెంబరు 11: కోరం లేకపోవడంతో బుధవారం జరగాల్సిన చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో సోమశేఖర రెడ్డి తెలిపారు. మండలంలో ఏడుగురు ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోయినా ఇద్దరి సభ్యులతో సమావేశం జరుపుతుండగా టీడీపీ నాయకులు ఎంపీడీవోను ప్రశ్నించారు. దీంతో చేసేదిలేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



శానంబట్లలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చంద్రగిరి, సెప్టెంబరు 11: ప్రజలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతులుగా ఉంటారని చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం చంద్రగిరి మండలం, శానంబట్లలో ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్థులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, నవజాత శిశువులు, చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెన్నలసాహితి, ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో ప్రదీప, సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పులివర్తి నానికి మంత్రి లోకేష్ అభినందన



తిరుచానూరు, సెప్టెంబరు 11: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని బుధవారం మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ విజయవాడ తూర్పు నియోజకవర్గం 22వ డివిజన్ కృష్ణలంకలో వరద ముంపు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిని కలిసి వారికి సహాయాలు అందాయా లేదా అని ఆరా తీసి నివేదిక రూపంలో మంత్రి నారా లోకేష్‌కు అందించానన్నారు. దాంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

అమ్మవారి సేవలో వైవీబీ రాజేంద్రప్రసాద్



తిరుచానూరు, సెప్టెంబరు 11: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని బుధవారం మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ బృందం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య, ఏపీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 300 ప్రత్యేక బస్సులు

ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారుల ఒప్పందం



టీఎన్ ఆర్టీసీ ఎండీని సన్మానిస్తున్న ఆర్టీసీ జిల్లా అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏపీ, టీఎన్ ఆర్టీసీ ఆధ్వర్యంలో 300 ప్రత్యేక బస్సులు తమిళనాడు నుంచి తిరుపతికి నడిపేందుకు ఇరురాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో బుధవారం ఇక్కడి అధికారులతో తమిళనాడు ఎస్ఈటీసీ ఎండీ ఆర్.మోహన్ బృందంతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని మార్గాలలో ఏపీ, మరికొన్ని మార్గాలలో తమిళనాడు బస్సులు రాకపోకలు సాగించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 30నుంచి వచ్చేనెల 13వరకు అదనంగా 300బస్సులు(ఏపీ 150-టీఎన్ 150) నడిపేందుకు అనుమతులకు అంగీకరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, మేనేజర్లు భాస్కర్, రామచంద్ర నాయుడు, హరిబాబు, భాస్కర్, తమిళనాడు అధికారులు గుణశేఖరన్, గణపతి, సెల్వం, మణి, మోహన్, శ్రీనివాసన్, నటరాజన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల రూట్‌మ్యాప్ ఇలా...

- తిరుపతి నుంచి చెన్నై వయా ఊత్తుకోట 30
- కాంచీపురం వయా తిరుత్తణి 20
- చెన్నై వయా శ్రీకాళహస్తి 5
- తిరువణ్ణామలై వయా వేలూరు 10
- వేలూరు వయా చిత్తూరు 65,
- కృష్ణగిరి వయా చిత్తూరు, కుప్పం 15, హోసూరు వయా కుప్పం 5.

తమిళనాడు బస్సుల రూట్ మ్యాప్ ఇలా....

- తిరుపతి నుంచి కల్లకుర్చికి వయా తిరువణ్ణామలై 10, విల్లుపురానికి వయా కాంచిపురం 8, పుదుచ్చేరికి వయా కాంచిపురం 10, వేలూరుకు వయా చిత్తూరు 26, తిరుపత్తూరుకు వయా వేలూరు 10, చెన్నైకి వయా తిరుత్తణి 18, తిరువణ్ణామలైకి వయా వేలూరు 8, చెన్నైకి వయా శ్రీకాళహస్తి 10, కాంచీపురానికి వయా పుత్తూరు 9, తాంబరంకు వయా కాంచిపురం 4, సేలంకు వయా వేలూరు 4, తిరుచ్చికి వయా వేలూరు 2, కోయంబత్తూరుకు వయా వేలూరు 4, కుంభకోణంకు వయా చెన్నై 2, తంజావూరుకు వయా వేలూరు 2, తిరుచ్చికి వయా చెన్నై 2, నాగపట్నంకు వయా పుదుచ్చేరి 3, కృష్ణగిరికి వయా కుప్పం 5, ధర్మపురికి వయా కుప్పం 5, హోసూరుకు వయా వేలూరు 6, హోసూరుకు వయా కృష్ణగిరి 2 బస్సులు నడుస్తాయి. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



బొజ్జ గణపయ్యకు ఘనంగా నిమజ్జనం

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 11: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఐదో బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని వినాయకసాగర్ వద్ద ఘనంగా నిర్వహించారు. గణపతి బొప్పా మోరియా అంటూ యువత పెద్దఎత్తున సందడి చేశారు. చిన్న పెద్దా తేడా లేకుండా మహిళలు సైతం వినాయక విగ్రహాలతో పాటుగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఇక్కడ మూడో రోజు సోమవారం ఏవిధమైన ఏర్పాట్లు చేశారో బుధవారం కూడా అదే తరహాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వాగతం పలికిన నిమజ్జన కమిటీ సభ్యులు

నిమజ్జనానికి తరలివచ్చే విగ్రహాలకు కరకంబాడి రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాగత మండపం వద్ద నిమజ్జన కమిటీ సభ్యులు హారతులు పట్టి నిమజ్జనానికి తరలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని సాగర్‌కు వచ్చారు. అనంతరం కమిషనర్ మౌర్య దంపతులు పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక సాగర్ వద్ద మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, అలిపిరి సీఐ రామకిషోర్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్‌సీ మునికృష్ణ, నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, చెన్నం నవీన్, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శ్రీనివాస్, చెంగారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, రుద్రకోటి సదాశివం, ఆనంద్‌రెడ్డి, బాబు, వంశీరాయల్, వెంకటేష్, శేఖర్, హేమకిరణ్, హరికల్యాణ్, మణికంఠ, వాసు, ఆనంద్, నవీన్‌రాయల్, అనిల్, రోషన్, వంశీ, మునిరత్నంరెడ్డి, బాబు, నాగేశ్వరరావు, కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 11: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పట్టణంలోని పలుప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. మండపాల వద్ద యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల ఉట్లోత్సవ కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారిని డప్పు వాయిద్యాల నడుమ కేరింతలు కొడుతూ, బాణసంచా పేల్చుతూ వినాయక సాగర్‌వైపు తరలివెళ్లారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల విగ్రహాలు లీలామహల్ సర్కిల్ మీదుగా వస్తాయి. దీంతో ఆ సర్కిల్ నుంచి వినాయక్ సాగర్ వరకు రోడ్డంతా జనంతో కోలాహలంగా ఉంది. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగాలమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో...



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 11: తిరుపతి ఎంఆర్‌పల్లి మెయిన్ రోడ్డులో నాగాలమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని బుధవారం చెక్కబండిపై నిమజ్జనానికి తరలించారు. బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి స్థానికులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, వర్రప్రసాద్, మండప నిర్వాహకులు బాలసుబ్రహ్మణ్యం, కిరీటిరెడ్డి, బాలాజీ, రంగారెడ్డి, మునిరాజా, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.10లక్షలు పలికిన లడ్డు




తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుధవారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూను వేలం పాటలో రూ.3.10లక్షలతో ఇంజనీరింగ్ విభాగం సొంతం చేసుకుంది. ఈసందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్యలు మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు వినాయక స్వామికి ఘనంగా పూజలు నిర్వహించామని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, సెక్రటరీ రాధిక,డీసీపీ శ్రీనివాసులరెడ్డి, ఆర్వోలు సేతుమాధవ్, కేఎల్ వర్మ, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ చిట్టిబాబులు పాల్గొన్నారు.





వేడుకగా రాధాష్టమి



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 11: తిరుపతి ఇస్కాన్ కృష్ణాలయంలో బుధవారం రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి తరువాత 15వ రోజున ఈ వేడుక జరుగుతుంది. ఇందులో భాగంగా ఉదయం 4 గంటలకు మంగళహారతితో రాధాగోవిందులను మేల్కొలిపారు. అనంతరం నరసింహకీర్తన, తులసికీర్తన, హరేకృష్ణ మంత్రజపం జరిగింది. తరువాత ఇస్కాన్ తిరుపతి శాఖ అధ్యక్షులు రేవతి రమణదాస్ రాధాష్టమి గురించి ప్రసంగించారు. అనంతరం రాధాగోవిందులకు అభిషేకం, పుష్పయాగం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

14నుంచి గోవిందరాజస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్11:తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో సెప్టెంబరు 14వ తేదీ శనివారం నుంచి 16వతేది సోమవారం వరకు మూడ్రోజులు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. 13వ తేది శుక్రవారం అంకురార్పణ, 14వ తేది ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంకాలం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 15వ తేదీన మూలవర్లకు, ఉత్సవమూర్తులకు, మాడవీధిలోని శ్రీమఠం ఆంజనేయ స్వామికి పవిత్రాలు సమర్పిస్తారు. సెప్టెంబరు 16న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ మూడ్రోజులూ శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామికి ఉదయం వేళ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

గాయపడిన స్టాఫ్‌నర్సుకు ప్రభుత్వ సాయం



చెక్కును యశోదకు అందజేస్తున్న రవిప్రభు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11: రోగి దాడిలో తీవ్రంగా గాయపడిన స్టాఫ్‌నర్సు యశోదకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ.32 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ నగదు చెక్కును సూపరింటెండెంట్ రవి ప్రభు, ఏఆర్ఎంవో హరికృష్ణలు బుధవారం ఆమెకు రుయాస్పత్రిలో అందజేశారు. విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సుపై మతిస్థిమితం లేని రోగి దుర్గాప్రసాద్ జూలై 7న దాడికి పాల్పడి గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్టాఫ్‌నర్సు పూరిగా కోలుకునే వరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, వైద్య ఖర్చులను కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆమె పూర్తిగా కోలుకుని తిరిగి విధుల్లో చేరారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ.32 వేల నగదును అందజేయడంతో ఆమె హర్షం వ్యక్తం చేశారు.

నేటితో ముగియనున్న సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఎస్వీ యూనివర్సిటీలో పీజీ ప్రవేశానికి సర్టిఫికెట్ల పరిశీలన గడువు గురువారంతో ముగియనుంది. పీజీసెట్ ర్యాంకు పొంది, ఎస్వీయూలో సీట్ అలాట్‌మెంట్ అయిన విద్యార్థులు డీఓఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయవలసి ఉంది. ఇందుకు ఈనెల 12వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు.

శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులకు టోకెన్ల కొరత లేకుండా చూస్తాం: టీటీడీ

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గం భక్తులకు టోకెన్ల కొరత లేకుండా చూస్తామని టీటీడీ చీఫ్ పీఆర్వో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంకన్న దర్శనానికి శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు దర్శన టోకెన్లు తక్కువ సంఖ్యలో విడుదల చేయడంతో వారు నిరాశతో వెనుతిరుగుతున్న నేపథ్యంలో 'శ్రీవారి మెట్టు మార్గంపై టీటీడీ శీతకన్ను' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై టీటీడీ అధికారులు స్పందించారు. స్కానర్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు యుద్ధప్రాతిపదికన జరుగుతోందని, త్వరలోనే శ్రీవారి భక్తులకు గతంలో జారీచేసిన టోకెన్లను కేటాయిస్తామని వెల్లడించారు. అప్పటివరకు భక్తులు సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఒక వ్యాధి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11: సమస్యలనేవి ప్రతి ఒక్కరికీ ఉంటాయని, వాటికి ఆత్మహత్య పరిష్కారం కాదని, ఆత్మహత్య చేసుకోవాలని వచ్చే ఆలోచన ఒక వ్యాధి అని, దానికి కౌన్సెలింగ్‌తో చికిత్స ఉందని రుయాస్పత్రి మానసిక విభాగాధిపతి రాధాకృష్ణన్‌రాజు పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో కలిసి ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పిస్తూ రుయాస్పత్రి నుంచి ఎస్వీ వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో అధిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలే ఆత్మహత్యలకు ప్రధాన కారణాలవుతున్నాయని, వీటితోపాటు ప్రతి చిన్న విషయాన్ని యువత ఆలోచించకుండా విచక్షణ కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని సమీపంలోని మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాలకు తీసుకువస్తే వారికి ఇక్కడి సిబ్బంది తగిన కౌన్సెలింగ్ ఇచ్చి, ఆత్మహత్యల వంటి ఆలోచనలను దూరం చేస్తారని ఆయన తెలిపారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడితే ఆ కుటుంబ పడే బాధ, నష్టం గురించి ఒక్క నిమిషం ఆలోచిస్తే ఏ ఒక్కరూ కూడా ఆత్మహత్యకు పాల్పడరన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్‌రావు, భూపాల్ నాయుడు, కిషోర్, కవిత, మానస, సిబ్బంది మురళి, సౌభాగ్య పాల్గొన్నారు.

ఎస్వీయూ 70 ఏళ్ల ప్రస్థానంపై రేపు ప్రతిభా పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఎస్వీయూ 70 ఏళ్ల ప్రస్థానంపై ఈనెల 13వ తేదీ వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. వర్సిటీ కల్చరల్ అఫైర్స్ విభాగం ఈ పోటీలు నిర్వహించనుంది. ఉన్నత విద్యారంగ వ్యాప్తిలో ఎస్వీయూ 70 ఏళ్ల ప్రస్థానంపై విద్యార్థులకు ఈ ప్రతిభా పోటీలు చేపడతారు. ఆసక్తి గల విద్యార్థులు 13వ తేదీ ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్‌లో కానీ, 8500960162 నెంబరులో కానీ సంప్రదించవచ్చని కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తెలిపారు.

ఎంపీ మిథున్ జన్మదినోత్సవం



రక్తదానం చేస్తున్న హరిప్రసాదరెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి 47వ జన్మదినోత్సవం బుధవారం ఎస్వీయూలో ఘనంగా జరిగింది. వైఎస్ఆర్ విద్యార్థి సంఘం రాయలసీమ ప్రాంత కో-ఆర్డినేటర్ హరిప్రసాదరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది. వర్సిటీ మెయిన్‌గేట్ వద్ద హరిప్రసాదరెడ్డితో పాటు పలువురు రక్తదానం చేశారు. అనంతరం వైసీపీ సత్యవేడు ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. మిథున్‌రెడ్డి రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని హరిప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు వీరేంద్రవర్మ, మురళీధర్, హేమంత్‌రెడ్డి, సుధాకర్, కిషోర్‌దాస్ పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 11: బీజేపీ నాయకులు నగరంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక గంగమ్మ గుడివద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 82 నుంచి 86 బూత్‌లలో 1000 మందిని సభ్యులుగా చేర్పించారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్, కళ్యాణి, రమణప్ప, చంద్రశేఖర్ రాయల్, సుబ్రమ్మణ్యంరెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, దీపక్ యాదవ్, చంద్రబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌గౌడ్‌కు పరామర్శ



ఆనంద్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న నరసింహ యాదవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ పరామర్శించారు. పద్మావతి నగర్‌లోని ఆనంద్‌గౌడ్ నివాసానికి వచ్చి బుధవారం ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 21, 22 డివిజన్ల టీడీపీ అధ్యక్షులు గుర్రం బాల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్వీయూ ఉద్యోగుల ఒక్క రోజు వేతనం



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న ఉద్యోగులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11: వరద బాధితుల కోసం ఎస్వీయూ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అంగీకార పత్రాన్ని ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వారు అందజేశారు. ఎస్ఎంఆర్, హాస్టల్ ఎస్ఎంఆర్, టైంస్కేల్, పర్మినెంట్ నాన్ టీచింగ్, రిటైర్డు నాన్ టీచింగ్ ఉద్యోగుల ఒక్క రోజు వేతనాన్ని వరద బాధితులకు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పీకే సుబ్రమణ్యం, అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం, మిమిక్రీ విజయకుమార్ పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 బాధ్యతలు గ్రేడ్ 2కి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11: నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 బాధ్యతలను గ్రేడ్-2కి అప్పగిస్తూ రుయా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అధికారి అరుణమ్మపై వచ్చిన అవినీతి ఆరోపణలపై రుయా, ఎస్వీ వైద్య కళాశాల ప్రత్యేకాధికారి కనకనరసారెడ్డి విచారణ నిర్వహించి, ఆ నివేదికలను ఇటీవల కలెక్టర్‌కు అందజేశారు. ఈ నివేదికల ఆధారంగా నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 బాధ్యతలను పూర్తిగా గ్రేడ్-2 అధికారి లలితకు మారికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మ సెలవుపై వెళ్లారు.

కలెక్టరేట్ ఉద్యోగుల దాతృత్వం

- వరద బాధితులకు ఆర్థిక సాయం



కలెక్టర్‌కు చెక్‌లను అందజేస్తున్న డ్వామా పీడీ, గృహనిర్మాణ శాఖ అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11: జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వరద బాధితులకు పెద్దమొత్తంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడతోపాటు అనేక ప్రాంతాల్లో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టింది. ఈక్రమంలో తమవంతుగా దాతలు సాయం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఆమేరకు బుధవారం కలెక్టరేట్ వ్యవసాయ శాఖ ఉద్యోగులు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు కలెక్టర్‌కు అందజేశారు. అలాగే డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తనవంతు సాయంగా రూ.23 వేల చెక్‌ను కలెక్టర్‌కు అందజేశారు. అలాగే జిల్లా గృహనిర్మాణశాఖ ఉద్యోగులు లక్ష రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికిగాను ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు తదితరులు కలెక్టర్‌కు అందజేశారు.ఆర్థికసాయం అందజేసినవీరిని కలెక్టర్ అభినందించారు.

వరద బాధితులకు రూ.20,000 విరాళం



చెక్కును ఎస్పీకి అందచేస్తున్న శంకర్‌రెడ్డి

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 11: విజయవాడలో వచ్చిన వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితుల కోసం తిరుపతికి చెందిన జిల్లా పోలీసు అధికారుల జాయింట్ సెక్రటరీ, హెడ్ కానిస్టేబుల్ జి.శంకర్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.20,000 సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందచేశారు. ఈ విరాళాన్ని ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా అందచేశారు. ఆయన్ను ఎస్పీ అభినందించారు. శంకర్‌రెడ్డి దాతృత్వాన్ని అదనపు ఎస్పీ వెంకట్రావు, అధికారులు అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సంప్రదాయబద్ధంగా తొలి చాటింపు



వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు బుధవారం అర్ధరాత్రి సంప్రదాయబద్ధంగా జరిగింది. పట్టణంలోని గాలిగంగు దేవస్థానం వద్ద జాతర నిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం ఆసాదుల తప్పెట్ల మోతలు, కేరింతల మధ్య ఈ నెల 25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర జరుగుతుందహో అంటూ స్థానికులు సందడి చేశారు. రాజా వీధిలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ఈవో శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర నిర్వహణకు అనుమతి



ఈవోకు తాంబూలం ఇస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: పోలేరమ్మ జాతరను సంప్రదాయాలను అనుసరిస్తూ నిర్వహించాలని వెంకటగిరి రాజా కుటుంబీకులు వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ యాచేంద్ర అన్నారు. బుధవారం కోటలోని బొడ్డుసైగా మండపంలో పోలేరమ్మ ఆలయ ఈవో ఎ.శ్రీనివాసులు రెడ్డికి ఆనవాయితీ ప్రకారం జాతర నిర్వహణకు తాంబూలం అందించారు. టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథం, సుబ్రమణ్యం, రమేష్, డిల్లీబాబు, సీఐ ఏ.వీ.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొర్లుకట్టల పనులు త్వరితగతిన చేపట్టండి



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

వాకాడు, సెప్టెంబరు 11 : గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో కురిసిన భారీ వర్షానికి స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించి బాలిరెడ్డిపాళెం వద్ద పొర్లుకట్టలతోపాటు వంతెన దెబ్బతింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జల వనరుల శాఖ అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన వంతెన, పొర్లుకట్టలను బుధవారం పరిశీలించారు. బాలిరెడ్డిపాళెం ప్రజలతో మాట్లాడిన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం టెండర్లు పూర్తి అయినప్పటికీ పనులు ప్రారంభించక పోవడంపై డీఈ సుబ్బారావును కారణాలను అడిగి తెలుసుకున్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని డీఈ తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జల వనరుల శాఖ ఏఈ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడే జవాన్లకు జోహార్లు: విజయశ్రీ



జవాన్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, సెప్టెంబరు 11: దేశాన్ని అనునిత్యం కనురెప్పల్లా కాపాడే జవాన్లకు జోహార్లు అని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. లడక్ నుంచి జూలై 18న కన్యాకుమారి వరకు 50 మంది జవాన్లతో ప్రారంభమైన సైకిల్‌యాత్ర మంగళవారం రాత్రి స్థానిక జడ్పీ బాలుర పాఠశాలకు చేరుకుంది. వారికి అన్ని అవసరమైన సదుపాయాలను సమకూర్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం జవాన్లను ఎమ్మెల్యే అభినందించారు. శాంతి, ఐక్యత కోసం జావాన్లు సైకిల్‌యాత్ర నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎంఈవో మునిరత్నం, టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, ఏ.సుధీర్, గంగాప్రసాద్, మస్తాన్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన వీఏవో పంచాయతీ

● కోర్టు ఉత్తర్వులను లెక్క చేయని వెలుగు అధికారులు

బాలాయపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని మన్నూరుకు చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ పంచాయతీ బుధవారం పోలీసుస్టేషన్‌కు చేరింది. మన్నూరుకు చెందిన జి. మాధవి ఐదేళ్లుగా వీఏవోగా విధులు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడు ఆమెను తొలగించేందుకు యత్నించడంతో హైకోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయస్థానం గ్రామ సంఘ తీర్మానం ప్రకారం కొనసాగించాలని వీఏవో విధుల్లో జోక్యం చేసుకోరాదంటూ తీర్పు వెలువరించింది. అయితే వెలుగు సీసీ ఇందిర నాయకులతో కుమ్మక్కై వీఏవోను విధులకు హాజరు కావద్దంటూ సంబంధిత పుస్తకాలను ఇవ్వాలని గ్రామ సంఘం అధ్యక్షురాలి ద్వారా ఒత్తిడి చేసింది. రెండు రోజుల క్రితం తీర్మాన పుస్తకం ఇచ్చింది. గ్రామ సంఘ తీర్మాన పుస్తకం తీసుకెళ్లిన అధ్యక్షురాలు వీఏవో మాధవికి గ్రామ సంఘ తీర్మానం లేదంటూ ఫోన్ చేసింది. అలాగే మిగిలిన పుస్తకాలు ఇవ్వాలని బుధవారం వీఏవో ఇంటివద్దకు కొందరిని తీసుకెళ్లి అడగంతో వివాదం నెలకొంది. దీంతో పుస్తకాలు ఇవ్వలేదని అధ్యక్షురాలు వీఏవోపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తన ఇంటిమీదకు వచ్చి దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని వీఏవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్క్ ఆర్డర్ లేకుండా బిల్లులు ఎలా ఇస్తారు?

కోట, సెప్టెంబరు 11: కోట పట్టణంలో తనకు తెలియకుండా రోడ్డు నిర్మించడమే కాకుండా దానికి సంబంధించిన బిల్లు రూ.36 లక్షలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం ఇది ఎంత వరకు సబబు అని ఎంపీటీసీ సభ్యుడు షేక్ షంషుద్దీన్ ప్రశ్నించారు. ఈమేరకు బిల్లు చెల్లింపులపై ఎంపీడీవో భవానికి ఫిర్యాదు చేశారు. తమ పరిధిలో పనికి తమకు సమాచారం ఇవ్వకుండా, ఆ పనులకు సంబంధించి వర్క్‌ఆర్డర్లు లేకుండా బిల్లులు ఎలా చెల్లిస్తారన్నారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తానని షంషుద్దీన్ హెచ్చరించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు



ట్రాక్టర్‌ను సీజ్ చేస్తున్న వీఆర్వో

పెళ్లకూరు సెప్టెంబరు 11: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను బుధవారం తెల్లవారు జామున వీఆర్వో కల్యాణి పట్టుకున్నారు. మండలంలోని ముమ్మారెడ్డిగుంట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వీఆర్వో దాడులు చేశారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ద్వారకానాథ రెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి జరిమానా విధించి వాహనాలను వదిలేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ముగిసిన వేనాడు దర్గా గంధోత్సవం





గంధాన్ని ఊరేగిస్తున్న గ్రామ పెద్ద సుదర్శన్ మొదలి - బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు - బాబాకు సారె తీసుకువచ్చిన మహిళలు

తడ, సెప్టెంబరు 11: మండలంలోని వేనాడులో ఉన్న షేక్ దావూద్‌షా వలీ అల్లా తాత దర్గా 29వ గంధోత్సవం బుధవారం తెల్లవారు జామున ముగిసింది. మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం అర్ధరాత్రి తరువాత మత పెద్దలు, గ్రామపెద్దల సమక్షంలో గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. గ్రామపెద్ద సుదర్శన్ మొదలి ఆ గంధాన్ని బాబా సమాధికి లేపనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలా లేపనం చేసిన గంధాన్ని తరువాత భక్తులకు పంచిపెట్టారు. ఈక్రమంలో గ్రామంలోని హిందూ మహిళలు సంప్రదాయబద్ధంగా సారెను తీసుకు వచ్చి ఆనవాయితీ మేరకు బాబాకు సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి గంధో త్సవాన్ని ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు దర్గా వద్దకు చేరుకోగా వారికి దర్గా నిర్వాహకులు సాదరంగా ఆహ్వానిం శాలువాలతో సత్కరించారు. ప్రత్యేక ప్రార్థలు, పూజల్లో పాల్గొన్న అనంతరం మత పెద్దలు ఆశీర్వచనం ఇప్పించారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, బి.శ్రీధర్, సెల్వం, నీలకంఠం, బి.పళణి, టీకే శ్రీనివాసన్, మాధవనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు





గూడూరు, విద్యానగర్‌లనుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు - తూపిలిపాళెం తీరానికి చేరుకున్న భారీ వినాయక ప్రతిమ

కోట, సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో గణేశ నిమజ్జనాలు జరిగాయి. కోట, గూడలి, తిన్నెలపూడి, ప్రకాశం కాలనీ, విద్యానగర్‌లలో నిమజ్జనానికి ముందు ప్రతిమల గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో యువత కేరింతలు కొడుతూ శ్రీనివాససత్రం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. తహసీల్దారు జయజయరావు, పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, వీఆర్వో శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గూడూరు అర్బన్: పట్టణంలోని పలు కూడళ్లలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను బుధవారం నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతిమలకు పూజలు నిర్వహించి, వాహనాలపై ఉంచి, పట్టణంలో ఊరేగించారు. పంబలేరు, తూపిలిపాళెంలలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లారు.

వాకాడు : భక్తి శ్రద్ధలతో వైభవంగా 5 రోజులు పూజలు అందుకున్న గణపయ్యలు నిమజ్జనానికి చేరడంతో తూపిలిపాళెం సముద్రతీరం బుధవారం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ తూపిలిపాళెం సముద్రతీరానికి 450కి పైగా వినాయక ప్రతిమలు నిమజ్జనానికి భక్తులు తీసుకువచ్చారన్నారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో గణేశ్ నిమజ్జన వేడుకలను పలు ప్రాంతాల్లో బుధవారం కోలాహలంగా జరిగాయి. వినాయకచవితి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గణేశ్ ప్రతిమలను ఐదో రోజు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా బాపూజీ వీధి, గాండ్లవీధిలో కొలువు దీర్చిన వినాయక మండపాల వద్ద కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. గణపయ్య ప్రతిమ లను మంగళమేళాలు, కేరళ బ్యాండ్ మేళాలలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి కాళంగి నదిలో నిమజ్జనం చేశారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఓజిలి: మండలంలో వినాయక ప్రతిమలను యువకులు నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన వినాయక చవతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను క్రమంగా తరలిస్తున్నారు. ఓజిలి, చిలమానుచేను, వెంకటరెడ్డిపాలెం, పెద్దపరియ, ఆరిమేనిపాడు తదితర గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై.. అంటూ కేరింతులతో గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారు.

కొనసాగిన చవితి వేడుకలు

నాయుడుపేట టౌన్: చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 5వ రోజు పట్టణంలోని కూడలి ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో



వేలంలో లడ్డూ దక్కించుకున్న జగదీష్

వినాయక ప్రతిమల పందిళ్ల వద్ద అన్నదానాలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా యువత రంగులు చల్లుకుంటూ, డీజే వాయిద్యాల నడుమ నృత్యాలతో ఆనందోత్సాహాలతో తరలించారు. రాజకృష్ణాపురంలోని వినాయక ప్రతిమల వద్ద చవితి లడ్డూను రూ.1.15 లక్షలకు వేలంలో జగదీష్ దక్కించుకోగా, 5 రూపాయల మాలను రూ.20వేలకు నాగేంద్ర దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జి. మధుసూదన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నిర్వాహకులు వెంకటాద్రి, బృందం తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని పలు వినాయక ప్రతిమల వద్ద బుధవారం ఐదో రోజు అన్నదానాలు, ఉట్టి కార్యక్రమాలు నిర్వహిం చారు. వినాయక ప్రతిమలకు పూజలు నిర్వహించి లడ్డూలను వేలం వేశారు. తప్పెట్లు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు.

దక్కిలి: మండలంలోని పలు గ్రామాల్లో చవితి ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా జరుపుకొంటున్నారు. కమ్మపల్లి రోడ్డు సెంటరులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డక్కిలి ఎంఈవో పి.జగదీష్ బాబు దంపతులు ఉభయదాతలుగా అన్నదానం చేశారు. కాగా ప్రతిమలను తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేయరాదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో చేయాలన్నారు.



క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు తప్పని సరి
మహిళలకు ఎమ్మెల్యే విజయశ్రీ సూచన



స్ర్కీనింగ్ టెస్టు వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

దొరవారి సత్రం, సెప్టెంబరు 11: మహిళలు తప్ప నిసరిగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సూచించారు. తిరుపతి స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం మండలం తనియాలిలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఎమ్మెల్యే వైద్యురాలు కావడంతో బస్సుల్లో పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 35 ఏళ్ల నిండిన ప్రతి మహిళా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారులు చైతన్య, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి పెద్ద పీట



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

వెంకటగిరి, సెప్టెంబరు 11: కాపుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ బ లిజ సంఘ అధ్యక్షుడిగా మణి ఎకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సంఘ నా యకులు ఎమ్మెల్యేని బుధవారం మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... సంఘాలు పేదల సంక్షేమానికి తోడ్పా డునందించే విధంగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. పేదల సమస్యలు సంఘ సభ్యులు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామనన్నారు. ఈ కార్యక్రమంలో జి.మనోజ్ కుమార్, రాము, ఎల్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానంలోనే లావాదేవీలు



మహాజన సభలో ప్రసంగిస్తున్న రవి రాజశేఖర్

చిల్లకూరు, సెప్టెంబరు 11: సహకార సంఘ లావాదేవీలను ఇకపై ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తా మని డివిజన్ సహ కారశాఖ అధికారి రవి రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని తిప్పగుంటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణకు చర్యలు చేపట్టిందన్నారు. సంఘ సభ్యులు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించు కోవాలన్నారు. సుమారు ఈ సంఘంలో 1000 మంది వరకు ఉన్నారని ఇప్పటికి 600 మంది మాత్రమే వివరాలను అందించారన్నారు. సీఈవో ఆర్. రామానాయుడు, విద్యాసాగర్, ఇలియాజ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సాధించుకుందాం
వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల పిలుపు



నిరాహారదీక్ష చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట, సెప్టెంబరు 11: అన్నదమ్ములులాంటి ఎస్సీలు వర్గీకరణ పేరుతో విడిపోకుండా ఉమ్మడి ఉద్యమం చేసి హక్కులను సాధించుకుందామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. కోట పట్టణంలో బుధవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల మాలల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆయా నాయకులంతా ఆర్టీసీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడినుంచి ఎస్సీ వర్గీకరణ వద్దు.. రాజ్యాధికారమే ముద్దు అంటూ బజారుసెంటర్ మీదుగా కోట క్రాస్‌రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓట్ల కోసం చేసే ఈ మాయాజాలంలో బలిపశువులు కావద్దన్నారు. ఎం.మాధవ్, పి.వసంత్ కుమార్, అశోక్‌కాంబ్లే, డి.సుందరం తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్ విజేతలకు అభినందన

కోట, సెప్టెంబరు 11: మండలంలోని చిట్టేడు ఎన్‌సీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జూనియర్ జిల్లా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు అభినందన సభ జరిగింది. ఈనెల 9న నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జూనియర్ జిల్లా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎన్‌సీఆర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అండర్ 14 బాలికల విభాగం లాంగ్‌జంప్‌లో రోహిత ప్రథమస్థానం, అండర్ 14 బాలుర విభాగం లాంగ్‌జంప్‌లో విష్ణువర్ధన్ ద్వితీయస్థానం, అండర్ 16 బాలికల విభాగంలో దీపిక లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానం, జావెలిన్ త్రోలో ప్రథమస్థానం, సీహెచ్ చెంచువందన లాంగ్‌జంప్‌లో తృతీయస్థానం, జావెలిన్ త్రోలో ద్వితీయస్థానం సాధించారు. దీంతో విజేతలను హెచ్‌ఎం నిర్మలాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వాకాడు, సెప్టెంబరు 11 : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు, సంపూర్ణ ఆర్యోగవంతులుగా ఎదుగుతారని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అన్నారు. మండలంలోని బాలిరెడ్డిపాళెం, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11: పట్టణంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ మధులేటి సిబ్బందితో కలిసి బుధవారం పలు దుకాణాల్లో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుకాణదారులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించరాదని, ఫుడ్ లైసెన్సు తప్పని సరిగా ఉండాలన్నారు. ఆహార పదార్థాల విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పలు దుకాణాలను పరిశీలించారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ఓజిలి సెప్టెంబరు 11 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. ఓజిలిలో బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తమ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేయించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు కూడా తీసుకునేలా వైద్య సిబ్బందితో కలసి పనిచేయాలని అన్నారు.

విజయవాడ బాధితులను ఆదుకుందాం



ఎమ్మెల్యేకు చెక్కులు అందిస్తున్న నాయకులు

గూడూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గూడూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం విజయవాడలో వాకాడు మండలం టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వరదబాధితుల సంక్షేమానికి రూ.2లక్షల చెక్కును మధుసూదన్‌రెడ్డి, హరీష్‌బాబ అందజేశారు. ఆ నగదుతో 43వ డివిజన్‌లోని బాధితులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే బాధితులకు నిత్యావసరాలను, దుప్పట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వోత్తమరెడ్డి, నటశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోండి



ప్రసంగిస్తున్న యుగంధర్

గూడూరు, సెప్టెంబరు 11: స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు యుగంధర్ అన్నారు. బుధవారం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వివేకానందపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివేకానంద 1893వ సంవత్సరంలో సెప్టెంబరు 11న షికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో ప్రసంగించిన రోజు సందర్భంగా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచానికి నాగరికతను నేర్పింది వివేకా నందుడే అన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన వందమంది యువతను ఇస్తే ఈ దేశాన్ని మారుస్తానని ఆయన చెప్పిన బోధనలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చిన్నతనం నుంచే దైవభక్తి, దేశభక్తితో కూడిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, మూర్తి, మహేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న మట్టం శ్రావణి

గూడూరు, సెప్టెంబరు 11: విద్యార్థిని ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందజేసినట్లు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి చెప్పారు. చెన్నూరు గ్రామానికి చెందిన శ్రావణి గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ చదువుతోంది. ఆమె చదువులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆర్థికసాయం చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు శ్రావణి ఎంసీఏ మొదటి సంవత్సరానికి సంబంధించిన ఫీజు రూ.25వేలను ఎమ్మెల్యే అందజేయడంతో ఆ నగదును పంపిణీ చేసినట్లు శ్రావణి తెలిపారు.

విద్యార్థినికి నగదు అందజేత

గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలో ఉన్న ఫంక్షన్ హాలులో బుధవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో బలిజ విద్యాదీవెన కార్యక్రమం ద్వారా ఓ విద్యార్థినికి ప్రతిభా ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పట్టణానికి చెందిన సుప్రజ చదువులలో ప్రతిభ చూపడంతో సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రమణయ్య, ఎస్.శ్రీనివాసులు, ఎం.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మాజీ ఎంపీ

గూడూరు, సెప్టెంబరు 11: టీడీపీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్‌ను బుధవారం విశాఖపట్నంలోని ఆయన నివాసంలో కలిసినట్లు మాజీ ఎంపీ వరప్రసాద్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసివున్న గణేష్‌ప్రతిమ నిమజ్జన కార్యక్రమానికి ఆహ్వానించడంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు మాజీ ఎంపీ తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



గూడూరు అర్బన్, సెప్టెంబరు 11: స్థానిక చల్లకాలువ సమీపంలోని పొలాల్లో గుర్తుతెలియని యువకుడు మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 25ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని యువకుడి మృతదేహంపై నీలి రంగు జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ చొక్కా వున్నాయన్నారు. తల, శరీరంపై గాయాలున్నట్లు గుర్తించామన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ కిషోర్‌బాబు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

కాపాలదారు మృతదేహానికి నేడు పోస్టుమార్టం

చిల్లకూరు, సెప్టెంబరు 11: మండలంలోని తొణుకుమాల గ్రామ సమీపంలోని పొలాల్లో మృతదేహాన్ని పూడ్చడంపై కలకలం రేగిన విషయం విదితమే. ఓ తోటలో కాపలాగా ఉండే వెంకటేశ్వర్లు అదే తోటలో ఉండే కాపలాగా ఉన్న మరో వ్యక్తి అంకయ్యను కొట్టి చంపి పూడ్చివేసినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ క్రమంలో తోట యజమానురాలి ఫిర్యాదు మేరకు ఈనెల 12న గురువారం రెవెన్యూశాఖ అధికారులు, వైద్యుల సమక్షంలో గుంటను తవ్వి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరి మృతి



తడ, సెప్టెంబరు 11: రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. తడకు చెందిన ఎ.విష్ణు(26) బుధవారం మధ్యాహ్నం సొంత పనిమీద బైక్‌పై బోడిలింగాలపాడులోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపువద్ద సూళ్లూరుపేట నుంచి తడకు వస్తున్న బైక్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అతను మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

చెరువు కలుజు ఎదుట ప్రహరీ నిర్మాణం



కుర్రకాలువ చెరువు కలుజు ఎదుట ప్రహరీ కోసం వేసిన పిల్లర్లు

రేణిగుంట, సెప్టెంబరు 11: చెరువు కలుజు ఎదుట ప్రహరీ నిర్మాణం చేపట్టిన ఘటన రేణిగుంట మండలం కుర్రకాలువలో జరుగుతోంది. కుర్రకాలువ సర్వే నెంబరు 18/1ఏ, 4 ఎకరాలు డీకేటీ భూమి ఉంది. దీనికి పక్కనే కుర్రకాలువ చెరువు కలుజు ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీహోల్డ్ జీవో ప్రకారం డీకేటీని వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే చెరువు కలుజు ఎదురుగా ప్రహరీ నిర్మాణం కోసం పిల్లర్లు వేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ విషయంపై శ్రీకాళహస్తి ఏఈ మదనగోపాల్‌ను వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వాలని దరఖాస్తు చేశారని, అయితే నిబంధనల ప్రకారం ఎన్వోసీ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పామన్నారు. తమ అనుమతి లేకుండా చెరువు కలుజుకు ఎదురుగా ప్రహరీ నిర్మాణం నిర్మాణం చేపట్టడంపై రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్‌ఐ తీరుపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తా
వృద్ధురాలి ఆవేదన

రేణిగుంట, సెప్టెంబరు 11: రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తీరుపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని వృద్ధురాలు జ్యోతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గుత్తివారిపల్లి ఆంజనేయస్వామి ఆలయం రోడ్డు విస్తరణలో పోయిందన్నారు. తమ పట్టాభూమి అనుకుని తమ ఆధీనంలో ఉన్న డీకేటీ స్థలంలో ఆలయ నిర్మాణానికి ఐదు సెంట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండగా, ఇంకా ఎక్కువ భూమి కావాలనే విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తిందన్నారు. ఈ విషయంపై రేణిగుంట ఎస్‌ఐ ఆరుణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా తమకు న్యాయం చేయాల్సిందిపోయి వృద్ధురాలని చూడకుండా తాట తీస్తా ఏమనుకుంటున్నావ్ అంటూ ప్రత్యర్థుల ముందు అవమానించారని, అంతేకాకుండా తెల్ల పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారని జ్యోతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా ఎస్పీని కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేస్తానని చెప్పింది.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నేత మృతి

ఏర్పేడు, సెప్టెంబరు 11: ఏర్పేడు మండలం ఆమందూరు మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు మురగయ్య యాదవ్(51) గుండెపోటుతో మృతి చెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజుల క్రితం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మురగయ్య యాదవ్ మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి అన్నారు.

నంది వాహనంపై అగస్తీశ్వరస్వామి



నారాయణవనం, సెప్టెంబర్ 11: మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మూలవర్లకు పవిత్రాలు సమర్పించారు. బుధవారం ఉదయం పట్టు పవిత్రాలను ఆలయ అంతః ప్రాకరంలో ఊరేగించి యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం సముదాయం గ్రామవీధుల్లో నందివాహనంపై అగస్తీశ్వరస్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్నం, సూపరిటెండెంట్ ధర్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన కట్ట పుట్టాలమ్మ జాతర



దొడ్లమిట్ట నుంచి నాగపడగలను తీసుకెళుతున్న గ్రామస్తులు

రేణిగుంట, సెప్టెంబరు 11: కోరికలు తీర్చే కొంగు బంగారం కట్ట పుట్టాలమ్మ జాతర నాగహారతితో ముగిసింది. బుధవారం ఉదయం సంప్రదాయం ప్రకారం దొడ్లమిట్ట గ్రామం నుంచి నాగపడిగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మేళతాళాల నడుమ ఊరేగిస్తూ కట్ట పుట్టాలమ్మ ఆలయానికి చేర్చారు. అంతకుముందు అమ్మవారికి ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి నాగహారతి ఇవ్వడంతో జాతర ముగిసింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుజ్జినాయుడు, పాడి రాజేంద్ర, చలం, శ్రీను, మోహన్, సుధ, మునిరాజా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలంపై కేసు రద్దు చేయాలి

కేవీబీపురం, సెప్టెంబరు 11: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పెట్టిన కేసును రద్దు చేయాలని మండలంలోని అంబేడ్కర్ సంఘ నాయకులు బుధవారం సీఐ భాస్కర్ నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు కేవీబీపురంలోని సాయిబాబా ఆలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు రమేష్, మణి, పాల్గుణ, బాలాజీ, సాధు, థామస్, సురేష్, వర్మ, అయ్యప్ప, శేషగిరి, నాగరాజు, సెల్వమణి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని కుట్ర పన్ని కేసులో ఇరికించారని ఎస్‌ఆర్‌ఐ పార్థసారధి ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు బుచ్చినాయుడుకండ్రిగలో ధర్నా చేశారు. కుట్ర కోణంలో పెద్ద నాయకులు పాత్ర ఉందని, పోలీసులు సమగ్ర విచారణ చేయాలని ఎస్ఐ విశ్వనాథ నాయుడికి వినతిపత్రం అందజేశారు.

పుత్తూరు వార్తలు

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 11: పట్టణంలోని గేటు పుత్తూరులో గంగమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ధనపాల్ దుశ్శాలువా, గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. భానుప్రకాష్ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, మాజీ ఎంపీపీలు డీఎస్ ఏలుమలై, గంజి మాధవయ్య, కౌన్సిలర్ కేశవాచారి, నాయకులు గాలి గోపినాథ్, రమేష్, కరుణాయాదవ్, టీజీ రాజేంద్ర, ఈశ్వర్ యాదవ్, రమేష్, ఏకే.సారథి, పీకే. బాలకృష్ణ, బాబునాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను పోలీసులు వారం రోజులోనే రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. పట్టణంలోని ప్రాజెక్టు వీధికి చెందిన బాలాజీ వారం రోజుల క్రితం తిరుపతికి వెళ్లేందుకు ముక్కంటి ఆలయ సమీపంలోని భిక్షాల గాలిగోపురం వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కబోయాడు. ఈ క్రమంలో అతడి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ సీఐ గోపి సాంకేతిక పరిజ్ఞానంతో చోరీ జరిగిన సెల్‌ఫోన్ కదలికలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బాధితుడికి అప్పగించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి: కలెక్టర్



రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. వార్డుల వారీగా పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఆస్పత్రిలో రోగులకు సరఫరా చేసే భోజన నాణ్యత గురించి విచారించారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా సిబ్బంది డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ల్యాబ్‌లో పరికరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఆర్ఎంవో మధుతో పాటు వైద్యసిబ్బందితో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను సూపరింటెండెంట్ విజయలక్ష్మి విన్నవించారు. ఏడాది నుంచి జనరేటర్ పనిచేయకపోవడంతో విద్యుత్ కోతల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆర్వో ప్లాంట్ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య ఉందని వివరించారు. ఆ తరువాత కలెక్టర్ ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారితో మాట్లాడి ఆస్పత్రిలో వారంలో జనరేటర్ సౌకర్యం కల్పించేలా ఆదేశించామని తెలిపారు. జనరల్ మెడికల్ వైద్యాధికారి స్థానం ఖాళీగా ఉందని గుర్తించి ప్రత్యామ్నాయంగా డిప్యూటేషన్ ప్రాతిపదికన వైద్యుడిని నియమించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇక ఈనెల 20 నుంచి ఏరియా ఆస్పత్రిలో కంటి శస్త్రచికిత్సలు అందుబాటులో తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని, అలాగే డెంటల్ విభాగంలో అధునాతన పరికరాలను సమకూర్చి ఇంప్లాంటేషన్ సర్జరీలు కూడా ప్రారంభిస్తామన్నారు. డయాలసిస్ కేంద్రంలో విద్యుత్, నీటి సరఫరా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు.

పర్యాటకాభివృద్ధికి రూ.162 కోట్లు మంజూరు చేయండి





రాహుకేతు పూజలు చేసుకుంటున్న సురేష్ గోపి దంపతులు - వినతిపత్రం అందజేస్తున్న కోలా ఆనంద్, చెంచయ్య నాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.162 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపీకి టీడీపీ నాయకుడు చెంచయ్య నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి బుధవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఎన్డీఏ కూటమి నేతలు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్రలింగం వద్ద సురేష్‌గోపి కుటుంబ సమేతంగా రూ.5వేలు రాహుకేతు సర్పదోష నివారణ పూజలను జరిపించు కున్నారు. అనంతరం స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో విజయస్థూపం వద్ద కూటమి నేతలు కేంద్రమంత్రిని శేషవస్త్రంతో సత్కరించి స్వామి అమ్మవార్ల జ్ఞాపికను బహూకరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచన మేరకు కూటమి నేతలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తీశ్వ రాలయ అభివృద్ధికి రూ.140కోట్లు, ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయ అభివృద్ధి కోసం రూ.22 కోట్ల అభివృద్ధి పనులు ప్రతిపాదనల దశలో ఉన్నాయని, త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం





శ్రీకాళహస్తి పట్టణంలోని పీవీరోడ్డు, నారాయణవనంలో వినాయకుడి ఊరేగింపు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం వినాయక నిమజ్జనం కోలాహలంగా జరిగింది. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో వాడవాడలా బొజ్జ గణపయ్య ప్రతిమలను కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు ఆయా శిబిరాల్లో గణనాథుడికి త్రికాల నైవేద్యాలు, ధూపదీపాలు సమర్పించారు. మూడవ రోజు బుధవారం వినాయకుడి నిమజ్జనం చేశారు. పలుచోట్ల ఉట్టి కొట్టి యువత సంబరాలు చేసుకున్నారు. మరికొన్ని చోట్ల వినాయకుడికి నివేదించిన లడ్డూప్రసాదానికి వేలం నిర్వహించారు. సాయంత్రం పూజలు నిర్వహించిన అనంతరం వినాయక బొమ్మలను వాహనాలపై కొలువుదీర్చి ఊరేగింపుగా సాగారు. తప్పెట్లు, మేళతాళాలు, డ్రమ్స్ వాయిద్యాల మధ్య పిల్లలు, పెద్దలు, యువత చిందులేస్తూ కేరింతలు కొట్టారు. పట్టణవ్యాప్తంగా ఒక్కసారిగా వినాయక నిమజ్జనం ఊరేగింపులు జరగడంతో ఎక్కడా ట్రాఫిక్ సమస్య ఎదురవకుండా, నిమజ్జనం చేసే ప్రదేశాల్లో అపశృతులు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, బీఎన్‌కండ్రిగ, పల్లమాల, వెస్ట్‌వరత్తూరు, పుత్తేరి గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనం జరిగింది. వినాయకుడుకి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను పూలతో అలంకరించి నైవేద్యం పెట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. యువకులు వసంతులు పోసుకుని ఉట్టి ఉత్సవం నిర్వహించారు.

నారాయణవనం: మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం గణేష్ నిమజ్జన వేడుకలను కోలాహలంగా జరిగాయి. పాలమంగళం వద్ద ఏర్పాటు చేసి అభయ హస్త బాలవినాయకస్వామిని నిమజ్జనానికి తరలించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన చేశారు. యువత కోలాహలంగా ఉట్టికొట్టి సందడి చేశారు. అనంతరం వినాయకుడిని గ్రామవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

పిచ్చాటూరు: మండలంలోని చెంచురాజు కండ్రిగలో వినాయక నిమజ్జనం వేడుకగా జరిగింది. గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూ వేలం పాట నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జనార్దన్, రాజు, గోపాలరాజు, రామచంద్రరాజు, చలపతిరాజు, కుమార్‌రాజు, కృష్ణ బాబు, ముద్దుకృష్ణన్ రాజు, కుమారరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాలెం, సెప్టెంబరు 11: వరదయ్యపాళెం పంచాయతీ పరిధిలో గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత సరఫరా ఉండదని ఏఈ శివప్రసాద్ తెలిపారు. లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేవీబీపురం ఎస్‌ఐగా వీరాంజనేయులు



కేవీబీపురం, సెప్టెంబరు 11: కేవీబీపురం ఎస్‌ఐగా వీరాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి ఇక్కడ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. తాజాగా వీరాంజనేయులును నియమించడంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

గురుకుల పాఠశాల తనిఖీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: పట్టణంలోని కాసాగార్డెన్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి టి.పద్మజ తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు, కుళాయి వితరణ

ఏర్పేడు, సెప్టెంబరు 11: ఏర్పేడు మండలంలోని పాత వీరాపురం అంగన్‌వాడీ ప్రీప్రైమరీ పాఠశాలకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేస్‌నాథ్ 500 లీటర్ల సామర్థ్యం గల నీటిట్యాంకు, పిల్లల మరుగుదొడ్లకు కావాల్సిన కుళాయిలు, పైపులను వితరణ చేశారు.

టీకాలతోనే పశు వ్యాధులు దూరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: పశువులు, గొర్రెలు, మేకలకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ సమావేశ మందిరంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాలెం, పెళ్లకూరు, దొరవారిసత్రం మండలాలకు చెందిన పశువైద్యులు, పశుసంవర్ధకశాఖ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, జీవాలకు పీపీఆర్ రాకుండా టీకాలు, దూడల్లో బ్రూసేలోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్‌బాబు, ముని రాజా, ధనంజయ పాల్గొన్నారు.

కారూరు వద్ద సబ్‌వే, డంపింగ్ యార్డు నిర్మించండి



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 11: పిచ్చాటూరు మండలం కారూరు గ్రామం వద్ద సబ్‌వే, డంపింగ్ యార్డు నిర్మించాలని డిమాండ్ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ తచ్చూరు - చిత్తూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోందని, అయితే కారూరు గ్రామస్తులకు హైవేకి అవతల సుమారు 100 ఎకరాలకు పైబడిన భూములు ఉన్నాయని తెలిపారు. సబ్‌వే నిర్మించకపోతే రైతులు, పశువులు అటువైపు వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే గ్రామ పంచాయతీ నిర్మించిన డంప్ యార్డు హైవేలో కలిసిపోయిందన్నారు. కారూరు వద్ద సబ్‌వే, డంపింగ్ యార్డు నిర్మించేలా చూడాలని అధికారులకు పలుమార్లు అర్జీలు సమర్పించినా ప్రయోజనం లేకుండాపోతోందన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే దశలవారీగా పోరాటం చేస్తామని, ఇందులో భాగంగా ఈనెల 16న ఎక్స్‌ప్రెస్ హైవేపై వంటావార్పు కార్యక్రమం, 22న చిత్తూరు హైవే ఆఫీస్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిచంద్ర, రాజా, గురుమూర్తి, లోకేష్, కారూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా పండ్లతోటల పెంపకం

ఏర్పేడు, సెప్టెంబరు 11: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపట్టే రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు నిమ్మ, జీడి మామిడి, బత్తాయి, నాటు జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు చింత, ఆపిల్, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వాటిని సంరక్షించడానికి ఉపాధి పథకం ద్వారా నిధులను కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దేవరి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

నారాయణవనం, సెప్టెంబర్ 11: నారాయణవనం పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 85 వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. జీవో కారణంగా పీజీ అడ్మిషన్లలో 30 శాతంగా ఉన్న క్లినికల్ పీజీ సీట్లు 15 శాతానికి కుదించడం, అలాగే 50 శాతంగా ఉన్న నాన్ క్లినికల్ పీజీ సీట్ల శాతం 30 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని దాదాపు 2500 మంది వైద్యులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ

నాగలాపురం, సెప్టెంబరు 11: మండలంలోని వేంబాకం పంచాయతీకి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బుధవారం గ్రామంలో సంబంధిత అధికారులు విచారణ జరిపారు. వేంబాకం ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ కొన్ని సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యుల పేర్లతో, ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారిపేర్ల మీద మస్టర్లు వేసుకుంటూ లక్షల రూపాయల మేర డబ్బులను స్వాహా చేసి, అవినీతికి పాల్పతున్నాడని ఆరోపిస్తూ వేంబాకం పంచాయతీవాసులు ఇటీవల జిల్లా కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఉపాధి హామీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏపీడీ సరిత, ఏపీవో సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ గ్రామానికి చేరుకుని సర్పంచు తెన్రసు, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. అయితే విచారణ చేపట్టిన తీరుపై గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ చేపట్టిన అధికారులు గ్రీవెన్స్ సెల్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఏమాత్రం వివరాలు సేకరించకుండా, గ్రామ సభ పెట్టాం, కూలీల పేర్లు చదివాం, అంతా ఓకే కదా... అంటూ విచారణను మమ అనిపించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏపీడీని వివరణ కోరగా విచారణను పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు.

పరశురామేశ్వరుడి సేవలో కేంద్ర సహాయమంత్రి



సురేష్‌గోపి దంపతులను సత్కరిస్తున్న గిరినాయుడు తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 11: గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామిని బుధవారం కేంద్ర పర్యాటకశాఖ సహాయమంత్రి సురేష్ గోపి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, అధికారులు, స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి రూ.22 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సురేష్ గోపికి ఆలయ మాజీ ఛైర్మన్ బత్తల గిరిబాబునాయుడు వినతిపత్రం అందజేశారు.

వరద బాధితులకు రైస్‌మిల్లర్ల సాయం



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11: వరద బాధితుల సహాయార్థం శ్రీకాళహస్తి రైస్ మిల్లర్ల అసోసియేషన్ తరపున రూ.20లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైస్‌మిల్లర్లు విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.